# రంగు విరిగిన బొమ్మ

కొడవంటి కాశీపతిరావు



"హెడ్మాస్టరుకి మీరు చెప్పండి. మీరైతే తప్పకుండా వింటారు" అంటూంది హేమంత.

"నేను చెప్పడమేమిటండీ...నాకు ఆయన దగ్గర చనువు ఉన్న మాట నిజమే. అంత మాత్రాన నాకు సంబంధించని విషయాల్లో జోక్యం కలగజేసుకుని మాట వినడం నా కిష్టం లేదు." బెట్టుగా అంటున్నాడు ప్రభాకర్రావు.

పైన వరండాలో జరుగుతున్న సంభాషణా, దాని తాలూకు శాల్తీలనా కిటికీకి కట్టిన సన్నని తెరలోంచి సినిమాలా కాకపోయినా అదో కొత్త రకమైన దృశ్య కథలా కన్పిస్తూంది భార్గవకి.

"మీరు ముందుగా కదపండి. ఆపైన నేనే చెప్పుకుంటాను స్టాఫ్ తరపున. అంతగా మీ కిష్టం లేకపోతే మధ్యలో వెళ్ళిపోదురు గాని" అంది హేమంత. ఒప్పుకున్నట్టున్నాడు.

ముందు ప్రభాకర్రావూ, వెనకే నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ హేమంతా లోపలికి వచ్చేరు.

"ఎస్ . . ." చెప్పవలసిం దేదో చెప్పెయ్యమన్నట్టుగా అన్నారు భార్గవ వాళ్ళు కూర్చున్నాక. అతనికి నాన్చుడు నచ్చదు. టీచర్లు ఏదైనా చెప్పడానికి ఉపోద్ఘాతం ప్రారంభిస్తే రెండు క్షణాల సేపు వింటాడు. అప్పటికీ చెప్పేది అంతుబట్టకపోతే, "దేని గురించి మాట్లాడుతున్నారు?" అని టక్కున వేస్తాడు ప్రశ్న. జవాబును బట్టి "అయితే ఏమిటంటారు?" అని మరో బాణం విసురుతాడు. అంతే—అరగంట సాగవలసిన సంభాషణను అయిదు నిమిషాల్లో పరిష్కరిస్తాడు.

ఆ 'ఎస్స'న్న మాట అంత అధికారికంగా వచ్చేసరికి నోట మాటరాదు హేమంతకు. 'అబ్బ! ఎప్పుడూ అంత డ్యూటీ కాన్షస్‌తో ఎలా ఉంటాడో తెలియదు.'

"మరేం లేదు, మేస్టారూ...మన వాళ్ళందరూ రెండు రోజులుగా గుజ్జుగుజ్జులు పడి పోతున్నారు... మీరా ఏమీ మాట్లాడటం లేదు..." అని మొదలెట్టేడు ప్రభాకర్రావు.

"దేని గురించి?" అనడిగేడు మొదటి బాణంగా.

"మన స్కూలు పిక్‌నిక్ గురించి..." బాణందెబ్బకి నాన్చుడు కట్టేసింది ప్రభాకర్రావుకి.

"మీరేమిటంటారు?" అనడిగేడు.

"అబ్బే... నేనేమీ అనడం లేదు. ఇదిగో హేమంత గారు..." అంటూ వెనక్కి చూపించేడు

"ఎస్...మీరేమిటంటారండీ హేమంతగారూ..." అనడిగేడు మళ్ళీ.

"నే ననడం కాదండీ. టీచర్లందరూ అనుకుంటున్నాం. ఈసారి మన స్టాఫ్ పుణ్యగిరికి పిక్‌నిక్ వేసుకుందామని. మరి మీరూ ఒక మాట అనాలి కదా..." నసిగింది.

"ఇట్సాల్ రైట్... ప్రభాకర్రావు గారూ... ఆ ఏర్పాట్లేవో మీరూ, హేమంతగారూ చూడండి..." అంటూ ఏదో ఫైలు ముందరికి లాక్కోబోయాడు భార్గవ.

"అది సరే లెండి. కాని ఎప్పుడూ, ఎలాగా ఏమిటీ..." అంది హేమంత.

"నేను చెప్పడమేమిటండీ... ఎలా చేసినా నేను కాదంటాననుటండీ... కేరీ ఆన్..." అంటూ మరి మాట్లాడవలసిందేమీ లేదన్నట్టుగా ఫైల్లో తల దూర్చేశాడు.

"యజ్ఞం చేసినంత పనయింది" అంటూ స్టాఫ్ రూములో అడుగు పెడుతూనే నిట్టూర్చింది హేమంత. "ఈయనో చెప్పడం కన్న పిక్‌నిక్ ఆర్గనైజు చెయ్యడమే సులభం లాగుంది" అంటున్న హేమంత మాటలకి, "ఇంతకీ ఏమన్నారే హెడ్మాస్టరూ" అని ఆత్రంగా ఒక అరడజను కలకంఠాలు పలికేయి.

"నేను వెళ్ళడమూ, ఆయన కాదనడమూనా?" అంటూ గొప్ప చెప్పుకున్నాడు ప్రభాకర్రావు.

"నయమే. లేకపోతే హేమంత ఎంత చెప్తే అంత భార్గవకి" అని ఆ అరడజను కంఠాలూ ఇద్దరికీ వరసలు కట్టి రాగాలు పాడేస్తాయి. అందుకే

ఒప్పేసుకుంది.

"నాకయితే హెడ్మాస్టరి కరాఖండి మాటలకేం చెప్పాలో తోచదు. ప్రభాకర్రావు మేస్టారుండబట్టి గానీ..." అంది హేమంత.

"అదేం మగాడు మహాప్రభో...ఇంతమంది ఆడాళ్ళమున్నాం. ఒకప్పుడు కాపోతే ఒకప్పుడైనా కాస్త నవ్వుతో సరసంగా మాట్లాడ్డు కదా..." అంది ఒకామె భార్గవని ఉద్దేశించి.

"సర్వీసు మొత్తంమీద ఎప్పుడూ ఆడమనిషితో కలిసి పనిచేసి ఉండడే" అంది మరొకామె.

"అసలు ఆడాళ్ళంటే భయమేమోనే! అది కప్పిపుచ్చుకోడానికి డ్యూటీ, డ్యూటీ... డిసిప్లిన్,డిసిప్లిన్ అంటూ కేక లేస్తాడనుకుంటాను. అదోమేనియా" అంది హేమంత పరధ్యానంగా.

భార్గవ ఆ స్కూలుకు వచ్చిన హెడ్మాస్టర్లందరిలోకీ చిన్నవాడు. ముప్పయ్యయిదే ఉంటాయేమో! ఏ కారణం చేతనో పెళ్ళి చేసుకోలేదు. అందుచేత మరి కుర్రకుంక కింద జమకట్టేసి, ఆటలాడిద్దామని చూసేరు. అందరూ లేటుగా వచ్చేవాళ్ళు—హేమంత కూడా.

ఒక నెల్లాళ్ళు చూసేడు.

'ఇక నుండి లేట్లు నోట్ చెయ్యబడు'నంటూ స్టాఫ్ ఆర్డరు వేసేడు. "ఇలాంటివి మామూలే—ఘనాపాఠీలం మన కిదో లెక్క." అంటూ ఒకర్నొకరు ధైర్యం చెప్పుకున్నారు.

అందుచేత మర్నాడు నిబ్బరంగా లేటొచ్చింది హేమంత.

"లేట్ మార్కు చెయ్యండి" అంటూ అటెండెన్సు రిజిస్టరు ముందుకి తోసేడు హెడ్మాస్టర్.

"నేను వేగంగానే బయుల్దేరానండీ. కాని రిక్షా వాడు ..." అంటూ ఏదో చెప్పబోయింది హేమంత.

"కారణాలు నే నడగలేదు. ఒక నిర్ణయం తీసుకోవడం జరిగింది. దానికి కట్టుబడి తీరాల్సిందే. దట్సాల్ ..." అన్నాడు నిశ్చలంగా చూస్తూ. ఆ కళ్ళలోకి చూసే సరికి ఆ నిశ్చలతకి మొదటిసారిగా జడిసింది హేమంత. అయినా ఓడిపో దలచుకోలేదు.


"అలాగంటే ఎలా నండీ ... ఆడాళ్ళన్నాక ఎన్నో ఇబ్బందు లుంటాయి. మగాళ్ళు మీకేం తెలుసు?"

"డోంట్ ఆర్గ్యూ నౌ ... లేట్ మార్కు చేసి క్లాసుకు వెళ్ళండి." ఖచ్చితంగా చెప్పేసి మరేం వినేదిలేదన్నట్టు ఏదో రిజిస్టరు తీసేడు భార్గవ.

ఉక్రోషం వచ్చింది. ముఖమంతా ఎర్రబడిపోయి ఆవిరులతో ఉరుకులు పరుగులతో స్టాఫ్ రూములో కొచ్చి పడింది. అందరూ అందుకే ఎదురు చూస్తున్నట్టున్నారు.

"ఏం హేమంతా ... లేటు మార్కు చేసేవా? లేక నిన్ను వదిలేసేరా?" వేయిస్తే తన్ను ఎగతాళి చెయ్యడానికీ, చెయ్యకపోతే హెడ్మాస్టర్ని ఏకెయ్యడానికీ అడిగేరందరూ.

"అసలు నేను లేటు రావడానికి మీ రంతా కారణం. తోటి టీచర్ని ఇలాంటి వాటికి ప్రోత్సహించేరు. హెడ్మాస్టర్ చేత మాట పడ్డాను" అని కస్సుమంది వాళ్ళ మీద. దాంతో ఎవరి క్లాసుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయినా ఈ లేటు మార్కుల వ్యవహారం




ఎలా ఉపసంహరింప జెయ్యాలా అన్న ఆలోచనలు అందరిలోనూ ఆ వేళంతా సెగలు రేపింది.

స్టాఫ్ మీటింగులో రిక్వెస్టు చేద్దామన్న ఆలోచన కొందరికి వచ్చింది. ఆడాళ్ళ విషయంలో కాస్తయినా మార్జిన్ ఇవ్వడానికి ఒత్తిడి తెచ్చే ఉద్దేశంలో కొంద రున్నారు. ఎప్పటికైనా హెడ్మాస్టర్లోనే వీక్ పాయింట్ కనిపెట్టి అదే ఫోకస్ చేస్తే సరి రోగం కట్టేస్తుందని కొందరు ధీమాపడ్డారు.

రెండో రోజు హెడ్మాస్టరే లేటుగా వచ్చేరు. ఇంకేముంది? కొండెక్కినంత సంతోషమయింది.

ఆయన మీద నిఘా వేసిన వాళ్ళకి ఆయనే లేటుమార్కు చెయ్యటం కనిపించి కాస్త నిరుత్సాహం కలిగింది. అయితే ఆ ఒక్క రోజే కాదు. మరి మూడు రోజులు వరసగా లేటొచ్చేరు హెడ్మాస్టరు. 'మనబాపతే. కాకపోతే లేటు మార్కుచేసి మరీ లేటు రావచ్చును' అనుకున్నారంతా. కాని సి. ఎల్. రిజిస్టరులో ఆ నాలుగు లేట్లూ ఎంటర్ చేసుకుని తనకు తనే ఒకరోజు సి.ఎల్. విరగొట్టేసుకోవడంతో లేదు అన్న మాట కర్ణుడికి ఎలా తెలియదో లేటు అన్న ముక్క స్కూల్లో అలా లేకుండా పోయింది.

"ఏమిటే ... బెంత్ బి మీకున్నట్టుగా ఉంది" అని వినిపించడంతో తుళ్ళిపడి నిలుచుంది హేమంత. ఎదురుగా భార్గవ. స్టాఫ్ రూములోకి ఎప్పుడొచ్చిందీ చూడనేలేదు.

"ఏమిటలా ఉన్నారు? ఒంట్లో బాగాలేదా?" అని మళ్ళీ అడిగేడు.

"అబ్బే లేదండీ. బాగానే ఉంది" అంటూ గబగబా బెంత్—బికి పరిగెత్తింది హేమంత.

క్లాసులోకి వెళ్ళి కూర్చున్నా హేమంతకు భార్గవ గంభీరమైన రూపం మాటిమాటికీ గుర్తొస్తున్నది. గుర్తొచ్చినప్పుడల్లా మధురమైన అనుభూతి పొందుతోంది. అంతలోనే కటువైన అతని కంఠం, కంఠంలోని కమేండింగ్ నేచరూ చెవుల్లో గింగురుమంటున్నాయి.

'ఏమి టతని స్వభావం? అందరు టీచర్లతోనూ ఒకేలా ప్రవర్తిస్తున్నాడా? లేకపోతే తన వద్దనే భేషజం చూపిస్తున్నాడా? తనెంత దగ్గరగా అతనితో మాట్లాడాలనుకుంటున్నా ఎందుకు మాట్లాడలేక పోతోంది? పోనీ తను మాట్లాడలేకపోతుందే అనుకో—తనస్వభావం తెలిసీ అందరితో లాగే అంత నిర్లక్ష్యంగా డ్యూటీ ముసుగు వేసుకుని ఎందుకు మాట్లాడతాడు?

పిక్నిక్లో కూడా ఇలాగే హెడ్మాస్టరి అధికారం, దర్పం చూపిస్తాడు కాబోలు. ఇలాంటి వాళ్ళు నిద్రలోనూ ఎవరిమీదనో ఒకరి మీద కేకలేస్తుంటారేమో—అంటూ విసుక్కున్నప్పటికీ భార్గవ మీద కలిగిన అభిమానం మాత్రం పెరిగిందే గాని తరగలేదు హేమంతలో ...

ఉదయం ఎనిమిది గంటలయ్యేసరికి శృంగవరపుకోటలో బిలబిలా బస్సు దిగేసింది స్టాఫంతా. అక్కడే ఒక హోటల్లో భోజనాలు ఆర్డరిచ్చేసి, కూడా వచ్చిన ప్యూన్లను అవి పుణ్యగిరికి పట్టించుకొచ్చేయమని అప్పగించేరు. మిగిలిన వాళ్ళంతా నడుస్తూ బయుల్దేరారు.

శృంగవరపుకోట నుండి పుణ్యగిరికి పెద్ద దూరమేమీ కాదు. నడక అంతగా అలవాటు లేకపోవడం నుండీ, తోవ బాగుండకా, ఎత్తు హెచ్చవుతుండటం వల్లా ఒక్కొళ్ళూ వెనకబడ్డం ప్రారంభించేరు. భార్గవ, హేమంత మాత్రం చురుగ్గా కదిలి ముందయ్యేరు.


"సున్నితంగా ఉంటారు. మీరే నడవలేరేమో ననుకున్నాను" అన్నాడు భార్గవ.

"మీహారు... ఉహన్నారు ... కహాదా ... హందుకని...ఒహచ్చే సేహాను" అంది ఒకరాతిబండ మీద కూర్చుంటూ హేమంత. ఆయన ఒంటరిగా తారసపడితే తన అభిమానమంతా చూపింతామనుకుంటే ఆయాసం అడ్డొచ్చింది.

పకపక నవ్వేసేడు భార్గవ.

అప్పుడే ఒక్కొక్కరుగా చేరుకుంటున్న వాళ్ళంతా ఆశ్చర్యంగా చూశారు. ఇతనికి నవ్వడం కూడా వచ్చా అన్నట్టుగా.

"మరేమీ లేహదూ...హానీమన్ తగా హరూ...



# శ్రద్ధ

—సురిందర్ ఖాన్

ఆహా యానపహా ప్రోహా తున్నాహారా ...'' అన్నాడు భార్గవ వెక్కిరింతగా.

ఆయనకూడా కలిసి పోవడంతో అందరికీ హుషారు వచ్చి గలగల నవ్వుకున్నారు. తను చూపే అభిమానం గమనించనందుకు బుంగమూతి పెట్టుకున్నప్పటికీ, వెక్కిరించింది హెడ్మాస్టరు కాదు, తను అభిమానించే భార్గవ అన్న విజం స్పష్టమవగానే హేమంతకు పులకింత కలిగింది.

ఆయాసమే అడ్డగించకపోతే, ''మీ రున్నారు కదా, అందుకని వచ్చేశాను. మీతో జీవితంలో ఎంత దూరమైనా రావడానికి నేను సిద్ధమే'' అనే అర్థం వచ్చేట్లు చెప్పి ఉండేది. చెప్పకపోయినప్పటికీ అర్థం చేసుకోలేని వాడా భార్గవ? అర్థం అయినా టెక్కు చూపిస్తున్నాడా? లేకపోతే తన అభిమానాన్ని వేళాకోళం చేస్తున్నాడా?

మండిపోయింది హేమంతకు. వెంటనే తిక్క రేగి దికూడా.

''మేమంతా పేకాటలో కూర్చుంటున్నాం. ఒక చెయ్యిఖాళీ. వస్తారా, మాస్టారూ'' అనడిగా రెవరో.

''అబ్బే, నాకు రాదండీ. మీరు కానివ్వండి'' అంటూ అక్కడే నిలబడి ప్రకృతి సౌందర్యాన్ని చూస్తున్నాడు భార్గవ.

''మరి కొంత దూరం అలా ముందుకు వెళితే మరిన్ని మంచి సీనరీ కనిపిస్తుందండీ. రండి వెళదాం'' అంది అభిమానంగా హేమంత.

''ఇప్పుడే వచ్చాం గదా'' అంటూ నసుగుతూ, ''మీరు వెళ్ళిరండి'' అన్నాడు. బోడి సలహా ఎవడి క్కావాలి? సరదాగా వెళదాం రమ్మంటే...!

''నే నింతకు ముందు రెండు సార్లు వచ్చాను ఇక్కడికి. పోనీలెండి. ఇక్కడే కూర్చుందాం'' అంది మొండిగా.

''చూడాలనే ఉందనుకోండి. ఇప్పుడే వెళ్ళడమా, లేకపోతే వెళ్ళిపోయే ముందు అందరం కలిసి అన్నీ చూడడమా అని...'' అన్నాడు మళ్ళీ.

అంటే తను బతిమలాడుకోవాలి కాబోలు!

''మాస్టారూ...మేం చెట్లంటా, పుట్లంటా తిరగలేం కాని, మీరు చూడాలనుకుంటే ఇప్పుడే చూసొచ్చేయండి'' అంటూ పేకాటలోనుండి తలెత్త కుండానే కేకేశాడు ప్రభాకర్రావు.

''మరేం చేస్తాం? సరేపదండి'' అంటూ బయలు దేరాడు, అక్కడికి తన నేదో ఉద్ధరిస్తున్నట్టు.

కార్తీక మాస మేమో—చాలా పిక్నిక్ పార్టీ లొచ్చాయి. ఆ కొండ రాళ్ళమీద, గుట్టల మీద ఆ నిశ్శబ్దంలో, ఆ ఏకాంతంలో ఒ అంటే హో అని గొంతెత్తి పాడుకుంటూ, ఆడుకుంటూ ఉండే ప్రకృతికాంత ఏ రాతి బండల మాటునో దాగి పోయింది కాబోలు. ఎక్కడా సందడే!

అందరికీ పిక్నిక్ బాగా జరిగిం దనిపించింది. కాని హేమంత మాత్రం విస్ప ృహగానే బస్సెక్కింది.

బస్సెక్కాక చూశారు కాబోలు — ఒకరి తరవాత ఒకరు ''ఏమయిందండీ? చేతికి ఆ కట్టే మిటి'' అని భార్గవని అడుగుతున్నారు.

''అబ్బే...ఇందాక అలా వెళ్ళాం కదా. కాలు జారి సూదిగా ఉన్న రాతి బండమీద చెయ్యి ఆనింది— అంతే'' అంటున్నాడు.

ఆ కట్టు వైపు చూసింది హేమంత.

అవును. కాలు జారి చెయ్యి ఆనడంలో రాతి బండ సూదిగా ఉందేమో లోతుగా గాయమైంది. గుండెలోంచి ఆత్రతత, ఆదుర్దా నోట్లోనే కుక్కు కుని, చెంగు అడ్డం పెట్టుకుని నిల్చుండి పోయింది తను.

తను హేండ్కర్చీవ్ మరిచిపోయినట్టున్నాడు. రక్తం కారుతుంటే జేబులు తడుముకుని నిర్లిప్తంగా ఉండిపోయాడు. ఆ నిర్లిప్తం చూస్తే మండు తుంది. శాస్తి జరగాల్సిందే. అధికార మదంలో ఉన్నవాళ్ళకి మనుషుల అభిమానం తెలియదు అను కుంది. కాని మరుక్షణం మనసు లబలబ లాడింది.

''మాస్టారూ! ఇదిగోండి ఈ కర్చీవ్ చుట్టుకోండి చేతికి. అయ్యయ్యో! బ్లడ్ బాగా వస్తూందండీ'' అంది తన చేతి రుమాలు ఇస్తూ.

''ఫరవాలేదండీ'' అన్నాడు.

ఒళ్ళు భగభగ లాడిపోయింది.

''రక్తమండలమై పోతూంటే ఫరవాలేదంటా రేమిటి? చూస్తూ చూస్తూ లక్ష్యపెట్టకుండా ఉండటానికి నేను మనిషిని కాను అనుకుంటున్నా రేమిటి? కాస్త మీ దర్పం, దర్జా పక్కను పెట్టి ముందు కట్టు కట్టుకోండి'' అని తీవ్రంగా అతని చేతిని లాక్కుని చేతిరుమాలుతో గట్టిగా కట్టేసింది.

ఆ తరవాత అన్ని మాటలు తనెలా ందో తనకే ఆశ్చర్యం కలిగింది. ఇన్ని మాటలు అన్నందుకు రేపటి నుండి స్కూల్లో తన కెన్ని యాతన లుంటాయో అని భయంకూడా కలిగింది.

ఈ అనుభవంతో ఒక నెల్లాళ్ళ పాటు బుద్ధిగా మసలుకుంది హేమంత. ఆడా మగా అయినంత మాత్రాన, పెళ్ళి కాలేదన్నంత మాత్రాన, అందంగా ఉన్నాడన్నంత మాత్రాన అతని మీద అభిమానం పెంచుకోవడం అభిలషణీయం కాదు. ఇద్దరూ ఒక సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులు—అంతే. అదే దృష్టిలో నిబంధనలని తు. చ. తప్పకుండా పనిచేసింది ఆ నెల్లాళ్ళూ.

కాని ఆ రోజెందుకో హెడ్మాస్టారి రూము పక్క నుండి వెళుతూ వెళుతూ యథాలాపంగా కిటికీ వైపు చూసింది. కిటికీ తెర అడ్డం ఉన్నప్పటికీ అదేదో కొత్తరకం దృశ్య కళలా ఫ్రేము కట్టినట్టు లోపలి దృశ్యం కనిపించింది హేమంతకు.

టేబులు మీద ఏదో గుడ్డ పరిచి ఉంది. దాన్నే దీక్షగా చూస్తున్నాడు భార్గవ. మునివేళ్ళ మీద ఎగిరి చూసింది. అది...అది...తన రుమాలే! అవును, తను గుర్తు పడుతుంది. తెల్లటి రుమాలు మీద ఎర్రటి దారంతో మధ్యగా కుట్టిన పద్మం. మరి దాని మీదుగా అదేమిటి? సూర్యుడిలా. ఏమిటది? అవునది మట్టి రంగుకు విరిగిన ఎర్రటి రక్తపు మచ్చ. ఆ రుమాలును సుతారంగా మడత పెట్టుకుని పెదాల కానించుకుంటున్నాడు భార్గవ. ★